# సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 12 । ఆగస్టు । 2025




**ప్రధాని దిష్టిబొమ్మ దహనం**

గోదావరిఖని: ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో చౌరస్తాలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేశారు. బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు.



**14న సాగునీటి విడుదల**

సుల్తానాబాద్ : ఎస్సారెస్పీ నుంచి ఈనెల 14న సాగునీరు విడుదల చేయనున్నట్లు డీఈ మధుమతి తెలిపారు. వారబందీ ప్రకారం సాగునీరు అందిస్తామన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం 32.0/24.0

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం ఎక్కువ ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### అక్షరాస్యత పెంపొందించాలి



మాట్లాడుతున్న డీఈవో మాధవి

పెద్దపల్లిరూరల్: ప్రతీఒక్కరికి కనీస అక్షర జ్ఞానం అందించేందుకు చేపట్టిన ఉల్లాస్, నవభారత్ అక్షరాస్యత కార్యక్రమాలు సద్వినియోగమయ్యేలా చూడాలని డీఈవో మాధవి సూచించారు. రిసోర్స్‌పర్సన్‌లతో జిల్లా కేంద్రంలో సోమవారం ఆమె సమావేశమయ్యారు. చదువురాని వారనే చిన్నచూపుతో వయోజనులను కించపర్చవద్దన్నారు. కనీస అక్షరజ్ఞానాన్ని అందిస్తే కుటుంబంలో మార్పు కనిపిస్తుందని తెలిపారు. జిల్లా రిసోర్స్‌పర్సన్ జక్కం శ్రీనివాస్, ప్రతినిధులు స్వరూప్‌చంద్, అనిల్‌ప్రసాద్ తదితరులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వయోజనవిద్య ఏపీవో శ్రీనివాస్, కోర్సు డైరెక్టర్ సురేందర్‌కుమార్ పాల్గొన్నారు.

### వ్యాధి నిరోధక శక్తి పెంచాలి



మాత్రలు వేస్తున్న డాక్టర్ అన్నప్రసన్నకుమారి

పెద్దపల్లిరూరల్: టీనేజీ పిల్లల్లో రక్తహీనతను నియంత్రించడంతోపాటు వ్యాధినిరోధక శక్తిని పెంచేవి ఆల్బెండజోల్ మాత్రలని జిల్లా వైద్యాధికారి అన్న ప్రసన్నకుమారి అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీలు, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రోగ్రాం ఆఫీసర్ కిరణ్‌కుమార్, హెచ్‌ఎం అరుణ, ఆర్‌బీఎస్‌కే వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

**అంతర్గాం పీహెచ్‌సీ సందర్శన**

రామగుండం: అంతర్గాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మర్రిపల్లి ప్రభుత్వ పాఠశాలను జిల్లా వైద్యాధికారి అన్న ప్రసన్నకుమారి ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి



నామినేషన్‌పత్రం దాఖలు చేస్తున్న వరప్రసాద్

జ్యోతినగర్(రామగుండం): ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘం పట్టణ పొలిటికల్ అడ్వైయిజర్ రావికంటి వరప్రసాద్ అన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికల సందర్భంగా సోమవారం ఆయన తన నామినేషన్‌పత్రాన్ని ఎన్నికల అధికారులు వొల్లాల సురేశ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌కు అందజేసి మాట్లాడారు. సంఘం బలోపేతానికి పాటుపడతానన్నారు. పేద ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈనెల 17వ తేదీన నిర్వహించే ఎన్నికల్లో తనకు మద్దతు తెలియజేయాలని ఆయన కోరారు. అనంతరం వరప్రసాద్‌కు మద్దతుగా హిందూ ఐక్యవేదిక సభ్యులు ర్యాలీ నిర్వహించారు. హిందూ ఐక్యవేదిక సభ్యులు, ఆర్యవైశ్య ప్రతినిధులుపాల్గొన్నారు.

### కొత్త స్వశక్తి సంఘాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో కాళిందిని

పెద్దపల్లిరూరల్: జిల్లాలో కొత్త మహిళా స్వశక్తి సంఘాలతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, బాలికల సంఘాల ఏర్పాటును ఈనెలాఖరు వరకు పూర్తిచేయాలని డీఆర్డీవో కాళిందిని సూచించారు. ఏపీఎం, సీసీ, మండల సమాఖ్య ప్రతినిధులతో జిల్లా కేంద్రంలో సోమవారం ఆమె సమావేశమయ్యారు. కొత్తవారిని గుర్తించి స్వశక్తి సంఘంలో సభ్యత్వం పొందేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి వేణుగోపాల్‌రావు, అడిషనల్ డీఆర్డీవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### గ్యాస్ రీఫిల్లింగ్ షాపుల్లో తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

గోదావరిఖని: గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్లలో పోలీసులు సోమవారం తనిఖీ చేశారు. ఓ షాపులో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దీనిపై సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు సీఐ ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో లక్ష్మీనగర్‌లోని గ్యాస్‌స్టవ్, సిలెండర్ షాపుల్లో తనిఖీలు చేశారు. ప్రజాభద్రత, జీవనానికి భంగం కలిగించేలా వ్యవహరించిన 8 మందిని అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు.

# యూరియా కష్టాలు

- సొసైటీల వద్ద రైతుల పడిగాపులు
- వ్యవసాయ పనులు వదులుకొని నిరీక్షణ
- గంటల తరబడి బారులు తీరుతున్న వైనం
- అయినా, ఒక్కో రైతుకు రెండు బస్తాలే పంపిణీ

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



కూనారం సింగిల్‌విండో ఎదుట బారులు తీరిన రైతులు

సాక్షి పెద్దపల్లి: వానాకాలం పంటలకు అవసరమయ్యే ఎరువుల కోసం అన్నదాతలకు తిప్పలు ప్రారంభమయ్యాయి. వరినాట్లు మొదలైన 20 రోజుల తర్వాత యూరియా అవసరమవుతుంది. విత్తనాలు విత్తిన నాటినుంచీ చినుకు జాడలేక పైరు ఎండే పరిస్థితి ఎదురైంది. ఈ సమయంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు జీవం పోసినట్లయ్యింది. ఇదేసమయంలో పంటలకు యూరియా అవసరం ఏర్పడింది. దీంతో తమ పనులన్నీ వదులుకొని సింగిల్‌విండోలు, ఇతర సెంటర్లలో రైతులు పడిగాపులు కాస్తున్నారు. అవసరం మేరకు యూరియా అందుబాటులో ఉందని అధికారులు చెబుతూనే.. ఒక్కో ఆధార్ కార్డుపై రెండు బస్తాల యూరియా పంపిణీ చేయడం కొరతకు ప్రత్యక్ష సాక్షిగా నిలుస్తోంది. సోమవారం కాల్వశ్రీరాంపూర్, ఓదెల, పాలకుర్తి మండలాల్లో రైతులు యూరియా కోసం పీఏసీఎస్‌ల ఎదుట బారులు తీరడం సమస్య తీవ్రతకు అద్దంపడుతోంది.

**షరతులతో ఇబ్బందులు**

జిల్లాలో సుమారు 2.76 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయనుండగా, ఇప్పటివరకు వరి 1,42,153 ఎకరాలు, పత్తి 48,215 ఎకరాలు, కందులు 87 ఎకరాలు, మొక్కజొన్న 377 ఎకరాలు, మిగతా ఇతర పంటలు సాగు చేశారు. ఈసీజన్‌కు 32,447మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటివరకు 17,036 మెట్రిక్ టన్నులే సరఫరా అయ్యింది. గతేడాది ఇదేసమయానికి 28,868 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యింది. గతేడాదితో పోల్చితే.. సుమారు 12వేల మెట్రిక్ టన్నులు తగ్గినట్లు అధికారులే చెబుతున్నారు. ఆ లోటును పూడ్చేందుకు ఒక్కోరైతుకు రెండోబస్తా పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే అదనుగా యూరియా బ్యాగ్‌లతోపాటు నానో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, జింక్ కొనుగోలు చేయాల్సిందేనని కొందరు వ్యాపారులు షరతులు విధిస్తున్నారు. మరికొన్నిచోట్ల ఒక్కో బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకు పెంచి అమ్ముతున్నారు.

### రైతులకు తప్పని తిప్పలు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కూనారం సింగిల్‌విండో కార్యాలయం ఎదుట రైతులు ఉదయమే యూరియా కోసం బారుల తీరారు. ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకాలతో తరలివస్తే.. ఒక్కొక్కరికి ఒక యూరియా బస్తానే ఇచ్చారు. ఒకరం నుంచి పదెకరాల వరకు ఉన్న రైతులు.. ఒక్క యూరియా బస్తా ఎలా సరిపోతుందని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే మరికొంత వస్తుందని ఏవో నాగార్జున తెలిపారు.

**బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరలు..**

ఓదెల(పెద్దపల్లి): మొత్తం 22 గ్రామాలకు ఏకైక సొసైటీ పొత్కపల్లి. ఇక్కడే యూరియా పంపిణీ చేస్తున్నారు. దీంతో వేలాదిమంది రైతులు ఉదయమే సొసైటీ ఎదుట బారులు తీరారు. తమకు యూరియా ఇవ్వాలని నిరసన తెలిపారు. ఆందోళన పరిస్థితులు ఏర్పడడంతో ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది పరిస్థితిని చక్కదిద్దారు. మరోవైపు.. డీసీఎంఎస్‌లో యూరియాను బ్లాక్‌చేసి అధిక ధరలకు విక్రయించినట్లు రైతులు ఆరోపించారు.



పొత్కపల్లిలో బారులు తీరిన రైతులు

**జిల్లా సమాచారం**

| | |
|---|---|
| రైతుల సంఖ్య | 1,61,032 |
| సాగు లక్ష్యం(ఎకరాల్లో) | 2,76,076 |
| సాగైన వరి(ఎకరాల్లో) | 1,42,153 |
| సాగైన పత్తి(ఎకరాల్లో) | 48,215 |
| అవసరమైన యూరియా(మెట్రిక్ టన్నుల్లో) | 32,447 |
| ఇప్పటివరకు వచ్చిన యూరియా(మెట్రిక్ టన్నుల్లో) | 17,036 |
| ఇంకా రావాల్సిన యూరియా(మెట్రిక్ టన్నుల్లో) | 15,411 |
| గతేడాది ఇదే సమయానికి సరఫరా అయ్యింది(మె.ట.) | 28,868 |

### పొద్దంతా పడిగాపులు



యూరియా కోసం పొద్దున్నే పొత్కపల్లి సొసైటీ వద్దకు వచ్చిన. యూరియా ఉందని తెలిసి చాలామంది రైతులు గుమికూడారు. ఈక్రమంలో తోచుకున్నారు. చివరకు పోలీసులు రావడంతో అసంపూర్తిగా పంపిణీ చేశారు. – గుడి సుధాకర్‌రెడ్డి, గోపరపల్లె

### సరిపడా ఇవ్వాలి



ప్రస్తుతం వరి, పత్తి అధిక మొత్తంలో సాగైంది. వీటికి ఇప్పుడు యూరియా ఎంతోఅవసరం. ఇలాంటి పరిస్థితుల్లో సరిపడా యూరియా అందించాలి. ఇప్పటికే ఆశించిన వర్షాలు లేక పంటలు ఎదుగుతలెవ్వు. ఒక్కొక్కరికి రెండు బస్తాలే ఇస్తున్నారు. సరిపడా యూరియా అందించాలి.

– బొద్దు రాయమల్లు, కుక్కలగూడూరు

### రెండు బస్తాలే ఇచ్చారు



నాకు ఆరెకరాలు ఉంది. రెండు బస్తాలే ఇచ్చారు. ఇవి ఎన్నెకరాలకు సరిపోతయి? మిగతా యూరియా కోసం ఎన్నిసార్లు తిరగాలి. పంటకు యూరియా ఎప్పుడు వేయాలి? అదను దాటితే కర్ర పెరగది. సరిపడా ఇవ్వాలె.

– గడికొప్పుల రాజయ్య, వెన్నంపల్లి

### కొరత లేదు



యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అదనంగా కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవద్దు. ప్రసుత్తం 2,270 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి మరో 3వేల మెట్రిక్ టన్నులు వస్తుంది. యూరియా కొరత ఏమీలేదు.

– శ్రీనివాస్, డీఏవో

# అనుబంధ రంగాల అభివృద్ధికి పెద్దపీట



సోలార్ ప్లాంట్ స్థాపనకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన కలెక్టర్ శ్రీహర్ష

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథనిరూరల్: వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గుంజపడుగు శివారులో మంథని పీఏసీఎస్ ఆధ్వర్యంలో పీఎం కుసుమ్ ద్వారా రూ.3.50కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్, చిల్లపల్లిలో రూ.7 కోట్ల వ్యయంతో ఐదెకరాల్లో చేపట్టిన రెండు గోదాముల నిర్మాణానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి సోమవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రీన్‌ఎనర్జీ పాలసీలో భాగంగా నందిమేడారం, కాల్వశ్రీరాంపూర్, అప్పన్నపేట, మంథని ప్రాంతాల్లో ఒక్కో మెగావాట్ చొప్పున పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 4 నెలల్లో వీటిని పూర్తి చేయాలని మంత్రి సూచించారు. గుంజపడుగులో సహకార బ్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, ఆర్డీవో సురేశ్, డీసీవో శ్రీమాల, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**రైతు సంక్షేమానికి పాటుపడాలి**

కమాన్‌పూర్(మంథని): సహకార బ్యాంకులు, సొసైటీలు రైతుల సంక్షేమానికి కృషి చేసేలా ఆధునిక భవనాలు నిర్మిస్తున్నామని ఐటీమంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రూ.79 లక్షల వ్యయంతో నిర్మించిన కేడీసీసీ బ్యాంక్, రూ.65 లక్షలు వెచ్చించి నిర్మించిన పీఏసీఎస్ భవనాలను డీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ, ప్రజాప్రభుత్వం రైతు సంక్షేమం కోసం రాజీపడకుండా ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్, కమాన్‌పూర్, కన్నాల పీఏసీఎస్ చైర్మన్లు ఇనగంటి భాస్కర్‌రావు, బయ్యపు మనోహర్‌రెడ్డి, కమాన్‌పూర్ ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, నాయకులు సయ్యద్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# నేటినుంచి మల్టీడిపార్ట్‌మెంట్ కమిటీల పర్యటన

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల స్థితిగతులను కార్మికులు, ఉద్యోగులకు వివరించేందుకు మల్టీడిపార్ట్‌మెంట్ కమిటీలు అన్నిగనులు, డిపార్ట్‌మెంట్లలో మంగళవారం నుంచి పర్యటించనున్నాయని ఆర్జీవన్ జీఎం లలిత్‌కుమార్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంస్థ ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భవిష్యత్‌లో ఉద్యోగులు అవలంబించాల్సిన అంశాలపై కార్మికులను చైతన్య పర్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అదేవిధంగా ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జీఎం కోరారు. ఐఈడీ డీజీఎం అంజనేయులు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేషెంట్ల రద్దీ



పెద్దపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ సెంటర్ వద్ద వివరాలు నమోదు చేసుకుంటున్న పేషెంట్లు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, మాతా శిశు ఆస్పత్రుల్లో సోమవారం పేషెంట్ల రద్దీ పెరిగింది. జ్వరం, దగ్గు, జలుబు లాంటి సీజనల్ వ్యాధుల బారినపడ్డ వేలాదిమంది ఆస్పత్రుల బాటపట్టారు. ఓపీ వద్ద, బ్లడ్‌శాంపిల్ సేకరణ కోసం వివరాలను నమోదు చేయించేందుకు నిరీక్షించారు. వైద్యులు పరీక్షించి రాసిన మందులను తీసుకునేందుకు ఫార్మసీ కౌంటర్ వద్ద కూడా బారులుతీరారు. జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వచ్చిన గర్భిణులు టిఫా స్కానింగ్ కోసం పెద్దసంఖ్యలో క్యూలైన్‌లో వేచిఉండడం కనిపించింది.

**జీజీహెచ్‌లోనూ..**

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వరపీడితులతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) కూడా రద్దీగా మారింది. దగ్గు, జలుబు, తలనొప్పి, వాంతులు, విరోచనాలు, కీళ్లనొప్పులు, జ్వరం తదితర సమస్యలతో పేషెంట్లు ఆస్పత్రికి భారీగా తరలివచ్చారు. వరుసగా రెండురోజులు సెలవులు రావడంతో బాధితుల సంఖ్య భారీగా పెరిగింది. ఒక్కరోజే 1,270 మంది ఓపీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.



జీజీహెచ్‌లో బారులు తీరిన పేషెంట్లు

# ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చి తమ సమస్యలపై ప్రజావాణిలో ప్రజలు అందించే ఫిర్యాదులకు సంబంధిత శాఖ అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. నిశితంగా పరిశీలించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పదేపదే ఒకేసమస్యపై ఫిర్యాదులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి

నిరుపేద కుటుంబీకురాలిని. ప్రస్తుతం నివసిస్తున్న ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. నాకు ఇందిరమ్మ పథకం కింద ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి. – ఆవునూరి పద్మ, ముస్త్యాల, రామగిరి

### నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం

కలెక్టరేట్ ఎదుటి భూముల్లో నిబంధనలేమీ పాటించకుండా, లే ఔట్ అనుమతులు లేకుండానే నిర్మాణాలు సాగిస్తున్నారు. కట్టడి చేయాల్సిన మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. అక్రమంగా సాగుతున్న నిర్మాణాలను పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– రామన్, సామాజిక కార్యకర్త, పెద్దపల్లి

# కాలిపోతున్న కరెంట్ మోటార్లు



శాస్త్రీనగర్‌లోని మరమ్మతు కేంద్రం వద్ద కరెంట్ మోటారు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఈ వర్షాకాలంలో ఆశించినస్థాయిలో వర్షాలు కురువడంలేదు. దీంతోపాటు విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయంతో కరెంట్ మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. ప్రస్తుతం నాట్లు వేసిన రైతులు.. సాగునీరు పారించే విద్యుత్ మోటార్లు మరమ్మతుకు వెళ్లడంతో నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వ్యవసాయ పంపుసెట్ల ఆధారంగా..**

ఈసారి ఇప్పటివరకు లోటు వర్షపాతమే నమోదు అయ్యింది. దీంతో ఎక్కువ మంది రైతులు వ్యవసాయ బావుల వద్ద పంపుసెట్ల ఆధారంగా వివిధ పంటలు వేస్తున్నారు. నీళ్లు అందక పంటలు ఎండిపోతుండడంతో వాటిని కాపాడుకునేందుకు అన్నదాతలు నానాపాట్లు పడుతున్నారు. ప్రధానంగా అత్యధికంగా విద్యుత్ వినియోగించడంతో కరెంట్ మోటార్లు కాలిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే, లోవోల్టేజీ సమస్యతోనే అవి కాలిపోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఒకసారి కరెంట్ మోటారు కాలిపోతే మరమ్మతు కోసం సుమారు రూ.6000 – రూ.10,000 వరకు ఖర్చు అవుతోందని వ్యవసాయదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మరమ్మతులకు గురైన మోటార్లు**

| | |
|---|---|
| జూలై | 258 |
| ఆగస్టు | 50 |

**ట్రాన్స్‌ఫార్మర్ కాలితే రైతులపైనే భారం**

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే దాని మరమ్మతుల ఖర్చును రైతులపైనే వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ తీసుకొని మరమ్మతు కేంద్రానికి తామే తరలించాల్సి వస్తోందంటున్నారు.

### రెండుసార్లు కాలిపోయింది



వరినాటు వేసినప్పటి నుంచి కరెంట్ మోటారు రెండుసార్లు కాలిపోయింది. అధికారులకు చెబితే.. లో వోల్టేజీ సమస్య ఉందంటున్నరు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పెట్టి కొత్త కనెక్షన్లు అనుమతి తీసుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలి.

– ఆడెపు వెంకటేశ్వర్లు, కాట్నపల్లి

### అనధికార కనెక్షన్లే సమస్య

రైతులు అనుమతి లేకుండా కరెంట్ వాడడంతోనే లో వోల్టేజీ సమస్య వస్తోంది. తద్వారా విద్యుత్ మోటార్లు తరచూ కాలిపోతున్నాయి. బోరుబావుల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి. కొత్తగా విద్యుత్ కనెక్షన్ల కోసం డీడీ చెల్లిస్తే వెంటనే మంజూరు చేస్తాం.

– మాధవరావు, ఎస్ఈ, ట్రాన్స్‌కో

# రవాణా సౌకర్యంతోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే విజయరమణారావు
- ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై సమీక్ష

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): రవాణా వ్యవస్థ మెరుగు పడితేనే గ్రామాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందుతాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. కదంబపూర్ – కాల్వశ్రీరాంపూర్ గ్రామాల మధ్య రూ.1.50 కోట్ల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. కదంబపూర్ వివేకానంద విగ్రహం నుంచి కనుకుల ఎక్స్ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సతీశ్, పన్నాల రాములు, దామోదర్‌రావు, కొడెం అజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయరమణారావు

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం**

ఎలిగేడు(పెద్దపల్లి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని, అవినీతికి తావులేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే విజయరమణారావు సూచించారు. శివపల్లిలోని తన నివాసంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై హౌసింగ్ అధికారులు, ఎంపీడీవోలతో సమీక్షించారు. ఇళ్ల పురోగతిని అధికారులు తరచూ పర్యవేక్షించాలన్నారు. పనులు త్వరగా పూర్తిచేసేలా చూడాలని అన్నారు. హౌసింగ్ పీడీ రాజేశ్వర్, డీఈలు, ఏఈలు, ఎంపీడీవోలు దివ్యదర్శన్, శ్రీనివాస్, పద్మజ, పూర్ణచందర్, తిరుపతి, భాస్కర్‌రావు తదితరులు ఉన్నారు.

# బయట చెత్త వేస్తే జరిమానా

- బల్దియా కమిషనర్ అరుణశ్రీ
- అధికారులకు పలు సూచనలు

కోల్‌సిటీ(రామగుండం): బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసినా, నిషేధిత ప్లాస్టిక్ వినియోగించినా జరిమానా విధించాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం పారిశుధ్య పర్యవేక్షకులు, నీటిసరఫరా, మెప్మా సిబ్బంది, వార్డు అధికారులతో వేర్వేరుగా వివిధ అంశాలపై సమీక్షించారు. రోడ్లు, కాలువలు, ఓపెన్ ప్లాట్లలో చెత్తవేస్తే జరిమానా వసూలు చేయాలన్నారు. ఇంటింటా తడి, పొడిచెత్త వేర్వేరుగా సేకరించాలని, మురుగునీటి కాలువల్లో పూడికతీత, స్ప్రే, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయాలని ఆదేశించారు. స్వచ్ఛ ఆటోలు పూర్తిసామర్థ్యంతో రెండుసార్లు డంపింగ్ యార్డ్‌కు వెళ్లాలన్నారు. జ్వరాలు ప్రబలే ప్రాంతాల్లో పారిశుధ్య పనులు మెరుగుపర్చాలని అన్నారు. ఒకే ఇంటికి రెండు నల్లా కనెక్షన్లు ఉంటే ఒకటి తొలగించాలని ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేయించాలని ఆమె పేర్కొన్నారు. ప్రతీ ఉపరితల ట్యాంక్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచి మొక్కలు నాటాలని ఆదేశించారు. 18ఏళ్ల వయసు నిండిన నిరుపేద మహిళలతో కొత్త స్వశక్తి సంఘాలు, సమాఖ్యలు ఏర్పాటు చేయాలని ఆమె చెప్పారు. వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. వీధివ్యాపారులను గుర్తించాలన్నారు. ఆస్తిపన్ను, లైసెన్స్ రుసుం వసూలయ్యేలా వినియోగదారులను చైతన్యపరచాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ, వేదికపై డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, రామన్

## క్లుప్తంగా

### నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

**కరీంనగర్‌రూరల్:** బొమ్మకల్‌లోని ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఎడ్యూనెట్ ఫౌండేషన్ ద్వారా సాప్ కార్యక్రమాన్ని ఎడ్యునెట్ ప్రాజెక్టు మేనేజరు అఫ్సర్ పాషా, ప్రోగ్రాం మేనేజర్ దేవీసేన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకులు దాసరి మనోహర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎడ్యునెట్ ఫౌండేషన్ ద్వారా అందించే సాప్ కోర్స్‌ను ఎంబీఏ విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. చైర్మన్ దాసరి ప్ర శాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగేంద్రసింగ్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్, ఏవో రాజశేఖర్‌రెడ్డి, హెచ్‌వోడీ ప్రవీణ్‌కుమార్, సంతోషి, రజితరెడ్డి, ఇలియాస్‌అలీ, అజారుద్దీన్, సుప్రియ పాల్గొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**ముస్తాబాద్(సిరిసిల్ల):** ముస్తాబాద్ మండలం గూడెంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలు. గూడెంకు చెందిన పిట్ల దేవయ్య(60) సోమవారం ఉదయం ఇంట్లో మృతిచెంది ఉన్నాడు. దేవయ్య ముఖం, శరీరంపై గాయాలు ఉన్నాయి. మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సోదరుడు లస్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు సీఐ మొగిలి, ఎస్సై గణేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై తెలిపారు. దేవయ్య ఆయన కుమారుడు చందు తరచూ గొడవ పడేవారని, అర ఎకరం భూమి విషయంలో తండ్రీకొడుకుల మధ్య వివాదం తలెత్తిందని తెలిపారు. ఆ కోణంలో చందును ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు.

### జ్వరంతో యువకుడు..


శివ(ఫైల్)

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** మండలంలోని రాచర్లగుండారం గ్రామానికి చెందిన లకావత్ శివ(23) జ్వరంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. రాచర్లగుండారం గ్రామానికి చెందిన లకావత్ జయరాం–సోబి దంపతుల కుమారుడు శివ చిన్నతనం నుంచి మూర్ఛవ్యాధితో బాధపడుతుండే వాడు. గత నాలుగు రోజు లుగా జ్వరంతో బాధపడుతున్న శివకు ఆర్‌ఎంపీల వద్ద వైద్యం అందించారు. జ్వరం తగ్గకపోగా.. పరిస్థితి విషమించి మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

### డిష్ రిపేర్ చేస్తూ ఒకరు..


మహేశ్ మృతదేహం

**సారంగాపూర్:** మండలంలోని పెంబట్ల గ్రామంలో ఓ ఇంటిపై డిష్ రిపేర్ చేస్తూ.. కింద పడి పల్లికొండ మహేశ్ (40) మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై గీత కథనం ప్రకారం.. జగిత్యాలలోని పోచమ్మవాడకు చెందిన మహేశ్ పెంబట్లలోని చొప్పరి రాజేందర్ ఇంట్లో డిష్ రాకపోవడంతో మహేశ్ వైర్‌ను సరిచేసేందుకు ఇంటిపైకి ఎక్కాడు. మహేశ్‌నిలబడి ఉన్న సజ్జ విరిగి కింద పడిపోయాడు. మహేశ్ తల బండరాయిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### మత్తుకు అలవాటై..

**ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి(సిరిసిల్ల):** జల్సాలకు అలవాటుపడ్డ యువకులు క్రమంగా గంజాయి మత్తుకు అలవాటు పడ్డారు. డబ్బుల కోసం గంజాయి విక్రయిస్తుండగా పోలీసులకు చిక్కారు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం పందిమడుగుకు చెందిన మలావత్ రామ్‌కుమార్, వీర్నపల్లి మండలం సీతారాంనాయక్ తండాకు చెందిన బానోత్ అజయ్‌కుమార్, అజ్మీరా సాయివిశాల్ జల్సాలకు అలవాటుపడ్డారు. ఈక్రమంలోనే గంజాయికి అలవాటుపడ్డారు. డబ్బు సంపాదించేందుకు గంజాయిని తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు విక్రయించాలనుకున్నారు. వీర్నపల్లి మండలం రంగంపేటలోని జంపన్న చెరువు వద్ద గంజాయి విక్రయించేందుకు రాగా పోలీసులు చాకచక్యంగా పట్టుకుని కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. వారి నుంచి 50 గ్రాముల గంజాయి, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. వీరిని పట్టుకోవడం చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై లక్ష్మణ్, పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

### ద్విచక్ర వాహనం నుంచి పడిపోయిన బంగారం బ్యాగు

**జగిత్యాలక్రైం:** జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట–పొరండ్ల శివారులో ద్విచక్రవాహనంపై వెళ్తున్న భార్యాభర్తల వద్దనున్న బంగారం బ్యాగు పడిపోయిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. రాయికల్ మండలం వీరాపూర్‌కు చెందిన స్వామిరెడ్డి తన భార్యతో కలిసి సోమవారం జగిత్యాల మార్కెట్‌లో కూరగాయలు కొనుక్కుని వెళ్తుండగా వారి వద్దనున్న బంగారం బ్యాగు హన్మాజీపేట–పొరండ్ల మధ్యలో పడిపోయింది. పొరండ్లకు వెళ్లేసరికి బంగారు బ్యాగుతోపాటు, సెల్‌ఫోన్ కన్పించకపోవడంతో రోడ్డు వెంట పరిశీలించుకుంటూ వచ్చినా బ్యాగు దొరకలేదు. బాధితులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో పరిశీలిస్తున్నారు.

# ఊరట...ఉపాధి

- స్థానికంగానే మిర్చినారు పెంపకం
- నాడు గుంటూరు.. నేడు ఉప్పట్ల
- వంద ఎకరాలకు సరిపడా సాగు
- అన్నదాతలకు తప్పిన రవాణా భారం
- పది మంది కూలీలకు ఉపాధి అవకాశం


సాగుకు సిద్ధమైన మిర్చినారు

**మంథనిరూరల్:** ఒకరైతు ఆలోచన అనేకమంది అన్నదాతలకు ఊరటనిస్తోంది. ప్రధానంగా ఇతర ప్రాంతాల నుంచి నారు తీసుకొచ్చి పంట సాగు చేసేవారికి ఎంతోప్రయోజనం కలిగిస్తోంది. మరి కొందరు కూలీలకూ ఉపాధి చూపిస్తోంది. ఒకప్పుడు గుంటూరు వెళ్లి మిర్చినారు తీసుకువచ్చే రైతులకు ఇప్పుడు తమ స్వగ్రామంలోనే నారు పెంచుకునే అవకాశం కల్పించాడో రైతు. ఉప్పట్ల గ్రామానికి చెందిన రైతు పోగుల తిరుపతి ఆరేళ్లుగా మిర్చినారు సాగు చేస్తూ రైతులపై భారం తగ్గించేలా చేశాడు. గ్రామ శివారులోని కొంత భూమిని కౌలుకు తీసుకుని డ్రిప్ పద్ధతిన నారు సాగు చేస్తున్నాడు.

**ఒకప్పుడు గుంటూరు వెళ్లి..**

ఉప్పట్ల గ్రామంలో అత్యధికంగా మిర్చి సాగు చేస్తుంటారు. ఇందుకోసం రైతులు ఏపీలోని గుంటూరుకు వెళ్లి ఆంధ్రాడ్, ఎండ్‌పై లాంటి రకాల నారును తీసుకువచ్చి ఇక్కడ సాగు చేసేవారు. ప్రస్తుతం గ్రామంలోనే మిర్చినారు సాగు చేసుకునే అవకాశం లభించడంతో ఉప్పట్ల, గుంజపడుగు, విలోచవరం, పోతారంతోపాటు సమీప గ్రామాల మిర్చి రైతులకు ఊరట లభించింది.

**తగ్గిన భారం.. నాణ్యమైన రకం**

మిర్చిసాగు చేసే రైతులు గుంటూరు వెళ్లి నారు తీసుకురావడం తలకు మించిన భారమయ్యేది. ఉప్పట్లలోనే రైతులు కలిసి మిర్చినారు సాగు చేసుకోవడంతో అదనపు భారం తగ్గుతోంది. నాణ్యమైన రకాన్ని ఎంచుకునే అవకాశం లభించింది. గుంటూరు నుంచి తీసుకువచ్చే నారు ఎలాంటిదో తెలియక రైతులు అనేకసార్లు నష్టపోయిన సందర్భాలూ ఉన్నాయి.

**రైతుకు ఇష్టమైన విత్తనాలను..**

మిర్చి సాగుచేసే రైతులు తమకు ఇష్టమైన విత్తనాలను తీసుకువచ్చి ఇస్తే వాటిని అలికి నారు అయ్యే వరకు పెంచుతాడు. ఇందుకు ప్యాకెట్‌కు రూ.300 నుంచి రూ.400 వరకు చార్జీ తీసుకుంటాడు. సుమారు 45 నుంచి 50రోజుల వరకు మిర్చినారు నాటే స్థాయికి చేరుతుంది. ఇలా విత్తనాలను అలికి నారును ఇస్తుండటంతో స్థానిక రైతులకు ఉపశమనం లభించినట్లయింది.

**ఆరేళ్లుగా నారు పెంచుతున్న**



రైతులకు ఇష్టమైన వంగడాలు లేకపోవడంతో వారే విత్తనాలు తీసుకవస్తే అలికి నారు రెడీ చేసి ఇస్తా. అందుకయ్యే కూలీల ఖర్చులు తీసుకుంటా. ఉప్పట్లతో పాటు ఇతర ప్రాంతాల రైతులు ఇక్కడికే వచ్చి విత్తనాలు ఇచ్చి వెళ్తుంటారు. నాతో పాటు మరో పది మంది కూలీలకు ఉపాధి లభిస్తుంది.

– పోగుల తిరుపతి, రైతు, ఉప్పట్ల

**ట్రాన్స్‌పోర్టు ఖర్చులు తగ్గాయి**



మిర్చినారు కోసం ఏటా గుంటూరు వెళ్లే వాళ్లం. ఇందుకోసం మూడు, నాలుగు రోజుల సమయం పట్టేది. ఆ నారు నాణ్యత కూడా తెలిసేదికాదు. దిగుబడిపై ఆశలు ఉండేవికావు. తిరుపతి ఆలోచనతో ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు, సమయం మిగులుతోంది. నాలుగు ఎకరాలకు సరిపడా మిర్చినారు సాగు చేయిస్తున్న.

– ముచ్చుకుర్తి శేఖర్, రైతు, గుంజపడుగు

# అగ్ని ప్రమాదంతో రూ.1.67కోట్ల నష్టం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది


గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

- రెండోరోజూ అదుపులోకి రాని మంటలు
- పరిశీలించిన కలెక్టర్ సత్యప్రసాద్

**మెట్‌పల్లి:** పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ గోదాంలో జరిగిన అగ్ని ప్రమాదంతో భారీ నష్టం సంభవించింది. ఈ గోదాంలో సివిల్ సప్లయ్ శాఖ గన్నీ సంచులను నిల్వ ఉంచిన సంగతి తెలిసిందే. ఆ శాఖకు చెందిన రూ.97లక్షల విలువైన 9,07,527 పాత గన్నీ సంచులు దగ్ధమయ్యాయి. అలాగే మంటల ధాటికి 2వేల టన్నుల గోదాం ధ్వంసమైంది. దీనివల్ల రూ.70వేల నష్టం వాటిల్లినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై ఇరు శాఖలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఆదివారం ఉదయం పది గంటలకు చెలరేగిన మంటలు.. సోమవారం రాత్రి వరకు కూడా అదుపులోకి రాకపోవడం గమనార్హం.

**టెండర్‌లో జాప్యం..భారీ నష్టం**

- సివిల్ సప్లయ్ శాఖ గన్నీ సంచులను 2018లో ఈ గోదాంలో నిల్వ చేసింది. ఇందుకు గాను మార్కెటింగ్ శాఖకు ప్రతినెలా రూ.38వేలు చెల్లిస్తున్నట్లు తెలిసింది.
- ఆ సంచులను ఎక్కువ కాలం నిల్వ ఉంచకుండా టెండర్ ద్వారా విక్రయించాలి. ఈ విషయంలో ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు.
- తద్వారా అద్దె బకాయిలు పేరుకుపోయాయి. ప్రమాదంలో సంచులన్నీ కాలి బూడిదై భారీ నష్టానికి దారి తీసింది.

**భద్రతపై మార్కెటింగ్ శాఖ నిర్లక్ష్యం**

- గోదాంల భద్రత విషయంలో మార్కెటింగ్ శాఖ నిర్లక్ష్యం చూపుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- మార్కెట్ కార్యాలయానికి దూరంగా ఉన్న ఈ గోదాంల ఆవరణలో సీసీ కెమెరాలు లేకపోవడంతో పాటు సిబ్బంది పర్యవేక్షణ కొరవడడంతో ప్రతిరోజు వాటి వద్ద బయటి వ్యక్తులు పేకాట ఆడడం, మద్యం సేవించడం చేస్తున్నారు.
- గోదాంలో విద్యుత్ సదుపాయం లేకపోవడంతో షార్ట్ సర్క్యూట్‌కు అవకాశముండదు.
- అక్కడ పేకాట, మద్యం సేవించే వ్యక్తుల్లో ఎవరైనా ఈ ప్రమాదం చోటు చేసుకునే చర్యలకు పాల్పడ్డారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**శ్రమిస్తున్న ఐదు శాఖల అధికారులు**

- గోదాంలో చెలరేగిన మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకురావడానికి పోలీస్, రెవెన్యూ, సివిల్, మార్కెటింగ్, అగ్నిమాపక శాఖల అధికారులు సోమవారం ఉదయం నుంచి అక్కడే ఉండి తీవ్రంగా శ్రమిస్తున్నారు.
- ఆ గోదాం పక్కనే మరో మూడు గోదాంలు ఉండడమే కాకుండా నివాస గృహాలు ఉన్నాయి.
- మంటలు ఎగిసిపడినా.. వాటికి వ్యాపించకుండా పలు జాగ్రత్తలు తీసుకున్నారు.
- గోదాంకు మూడు వైపులా ఉన్న గోడకు పలు చోట్ల పెద్ద రంధ్రాలు చేశారు. అందులో నుంచి పెద్ద సంఖ్యలో సంచులను బయటవేసి మంటల ఉధృతిని కొంతమేర తగ్గించారు.
- రాత్రివేళలో కూడా మంటలను ఆర్పేందుకు అక్కడ తగిన ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం వరకు పూర్తిగా అదుపులోకి వచ్చే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు.

**పరిశీలించిన కలెక్టర్**

అగ్ని ప్రమాదం జరిగిన గోదాంను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ చేపట్టిన చర్యల గురించి తెలుసుకున్నారు. సాధ్యమైనంత తొందరగా మంటలను అదుపులోకి తీసుకరావడానికి ప్రయత్నించాలని అధికారులకు సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్దన్, డీఎస్పీ రాములు, అర్డీఓ శ్రీనివాస్, సివిల్ సప్లయ్ శాఖ డీఎం జితేంద్రప్రసాద్, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి సైదులు, సీఐ అనిల్‌కుమార్, ఆయా శాఖల సిబ్బంది ఉన్నారు.

# కాజీపేట – బల్లార్ష రైలుకు ఆదరణ కరువు


ప్రయాణికులు లేక బోసిపోయి కనిపిస్తున్న బోగీ

- రాత్రివేళలోనే ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం
- వేకువజామున గమ్యస్థానం చేరిక
- పదిమంది కూడా ప్రయాణించని వైనం
- తిరుగు ప్రయాణంలోనూ స్పందన కరువు
- రాకపోకల సమయాలు మార్చాలని డిమాండ్
- సికింద్రాబాద్ వరకు పొడిగించాలని విన్నపాలు

**రామగుండం:** కాజీపేట – బల్లార్ష మధ్య నడిచే బల్లార్ష ఎక్స్‌ప్రెస్ రైలు అర్ధరాత్రి ప్రారంభమవుతోంది. వేకువజామున గమ్యస్థానం చేరుకుంటోంది. దీంతో ప్రయాణికులు లేక బోగీలు బోసిపోయి కనిపిస్తున్నాయి. కాజీపేటలో రాత్రి 10.50 గంలకు ప్రారంభమైతే.. ఉప్పల్‌కు రాత్రి 11.09 గంటలకు, జమ్మికుంటకు రాత్రి 11.18 గంటలకు, ఓదెలకు రాత్రి గం.11.32 గంటలకు, పెద్దపల్లికి రాత్రి 11.41గంటలకు, రాఘవాపురానికి రాత్రి 11.47 గంటలకు, రామగుండానికి రాత్రి 11.54గంటలకు, బల్లార్షకు వేకువజామున 3.10గంటలకు చేరుకుంటోంది. తిరుగు ప్రయాణంలో బల్లార్షలో వేకువజామున 3.50గంటలకు ప్రారంభమై రామగుండానికి ఉదయం 5.47గంటలకు, పెద్దపల్లికి ఉదయం 6.15 గంటలకు, ఓదెలకు ఉదయం 6.34లకు, జమ్మికుంటకు ఉదయం 7.20గంటలకు కాజీపేటకు ఉదయం 8.50 గంటలకు చేరుకుంటోంది. దీనికి అర్ధగంట ముందే భాగ్యనగర్ నడవడంతో హైదరాబాద్ మార్గంలో ప్రయాణించేవారంతా అందులోనే వెళ్తున్నారు. దీంతో బల్లార్ష రైలుకు ప్రయాణికుల నుంచి ఆదరణ ఉండడంలేదు. మరోవైపు.. అర్ధరాత్రివేళ రాకపోకలు సాగించే ఈ రైలులో ప్రయాణించే కొద్దిమంది మహిళా ప్రయాణికులకు కూడా భద్రత కరువైంది. వారిరక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వస్తోంది.

**అవసరాలు గుర్తించాలి**



కాజీపేట–బల్లార్ష ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణికులకు ఎంతోఅవసరం. కానీ, వారికి అనుకూల సమయాలు లేవు. రైల్వే జాబితాలో ఉంది కానీ, ప్రయాణికులకు సేవలు అందించడంలేదు. ఇది నిష్ప్రయోజనం. వేళలు మార్చాలి. సికింద్రాబాద్ వరకు పొడిగించాలి.

– తంగెళ్ల రఘు, హన్మకొండ

**సమయాలు మార్చాలి**



బల్లార్ష ఎక్స్‌ప్రెస్ రైలు రాకపోకల సమయాలు మార్చాలి. సికింద్రాబాద్ వరకు లేదా భద్రాచలం వరకు రైలు సేవలు పొడిగించాలి. ఇదేవిషయంపై రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లాను. కాజీపేటలో సాయంత్రం 5.30లకు భాగ్యనగర్ తర్వాత రైలు లేదు. తిరుగు ప్రయాణంలో ఏడు గంటలకు బల్లార్షా వైపు, ఉదయం ఏడు గంటలకు అక్కడ బయలుదేరితే అనుకూలంగా ఉంటుంది.

– అనుమాన శ్రీనివాస్, డీఆర్‌యూసీసీ ప్రతినిధి

### అది చిరుత కాదు.. హైనా


మాట్లాడుతున్న ఎఫ్ఆర్‌వో

**ధర్మపురి:** ధర్మపురిలో మూడు రోజులుగా చిరుత సంచరిస్తోందని వస్తున్న వార్తల్లో నిజం లేదని, అది చిరుత కాదని, హైనా అని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్రీనాథ్ తెలిపారు. పట్టణంలోని ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ధర్మపురి పరిసర ప్రాంతంలో చిరుతపులి కనిపించిందని కొందరు జిల్లా అధికారులకు సమాచారం అందించారని, దీంతో ఫారెస్టు సిబ్బందితో సమీప పొలాలు, చెట్లపొదల మాటున గాలింపు చేపట్టామని, ఓ జంతువు పాదముద్ర లభించగా.. అది చిరుత పాదముద్రలని భావించి హైదరాబాద్ ఫోరెన్సికు పంపించామని తెలిపారు. అక్కడ చిరుత పాదముద్రలు కావని, హైనా అడుగులుగా గుర్తించారని తెలిపారు. హైనాతో మనుషులకు ఎలాంటి ప్రాణనష్టమూ జరగదని, మేకలు, గొర్రెల కోసం వస్తుంటుందని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సదాశివుడు, సిబ్బంది తదితరులున్నారు.

### కాపర్‌వైర్ దొంగల అరెస్టు

**ఎల్కతుర్తి:** పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని కాపర్ వైరును అపహరిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన బండి కుమారస్వామి, బండి సతీశ్ కొంతకాలంగా ఎలకతుర్తి, వేలేరు, భీమదేవరపల్లి, సైదాపూర్, హుజూరాబాద్, శంకరపట్నం ప్రాంతాల్లో రాత్రివేళల్లో 27 ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి వాటిలోని కాపర్ వైర్‌ను అపహరించారు. దానిని అమ్మగా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. ఈక్రమంలో ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తన సిబ్బందితో సోమవారం భీమదేవరపల్లి క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అడ్డుకున్నారు. వారి వద్ద కాపర్‌వైరు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టేందుకు ఉపయోగించే వస్తువులు ఉండడాన్ని గమనించి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా సులువుగా డబ్బులు సంపాదించేందుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్‌ను దొంగిలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. దొంగిలించిన కాపర్ వైర్‌ను ముల్కనూర్ గ్రామానికి చెందిన రుద్రాక్ష తిరుపతికి అమ్మినట్లు విచారణలో తేలింది. వెంటనే తిరుపతిని కూడా అదుపులోకి తీసుకున్నారు. గతంలో నిందితులపై 2012 నుంచి 53 కేసులు నమోదైనట్లు ఏసీపీ వెల్లడించారు. కాగా, నిందితుల నుంచి రూ.2.50లక్షల విలువ గల 250 కిలోల కాపర్ వైర్, మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. సీఐ పులి రమేష్, ఎస్సైలు సాయిబాబు, ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### రాణా మెట్లెక్కించిన సిగరేట్

- బస్తీఫైట్‌కు దిగిన యువకులు

**గోదావరిఖని:** సిగరేట్ తాగాలనే తాపత్రయం రాణా మెట్లెక్కించింది. ఇరువర్గాలు రోడ్డుపై కొట్టుకోవడం భయాందోళనకు గురిచేసింది. పోలీసులు రంగప్రవేశం చేసి 8మందిపై కేసు నమోదు చేశారు. గోదావరిఖనిలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి కథనం ప్రకారం.. ఇద్దరు మిత్రులు సిగరెట్ కోసం రాజేశ్ థియేటర్ సమీపంలోని ఓ పాన్‌షాప్ వద్దకు వెళ్లారు. మూడు సిగరెట్లకు డబ్బులు చెల్లించగా రెండు సిగరెట్లే ఇచ్చావని షాపు నిర్వాహకుడిని ప్రశ్నించారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగింది. కొట్టు కట్టేసే సమయం అయిపోయిందని, పక్కకు వెళ్లి సిగరెట్ తాగాలని షాపు యాజమాని సూచించాడు. దీంతో ఆయనపై ఇద్దరు మిత్రులు చేయి చేసుకున్నారు. ఈక్రమంలో బాధితుడు తన బంధువులకు ఫోన్‌చేసి ముగ్గురిని పిలిపించాడు. సిగరెట్ కోసం వచ్చిన ఇద్దరు యువకులు కూడా ఫోన్‌చేసి మరో ఇద్దరిని పిలిపించుకున్నారు. దీంతో ఇరువర్గాలకు చెందిన 8 మంది నడిరోడ్డుపై కొట్టుకోవడంతో అక్కడ భీతావహ పరిస్థితి తలెత్తింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఒక వర్గానికి చెందిన కె.ప్రణయ్‌కౌశిక్, మహ్మద్ ఆజీం, బి.ఆదర్శ్, టి.రాహుల్, మరో వర్గానికి చెందిన ఎం.శ్యాంసుందర్, ఎం.అభిలాష్, జి.రాజ్‌కుమార్, సీహెచ్ చంద్రమౌళిగా గుర్తించారు. నడిరోడ్డుపై గొడవకు దిగి శాంతిభద్రతలకు భంగం కలిగించిన నిందితులపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సిగరేట్ కోసం రాణా మెట్లు ఎక్కి కేసులో ఇరుక్కోవడం నగరంలో చర్చనీయాంశమైంది.

# ఆ తండ్రికదే చివరి వేడుక

- కొడుకు పుట్టినరోజున గుండెపోటుతో మృతి
- మూడురోజుల క్రితం సింగాపూర్ నుంచి రాక


కొడుకు పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న మధుకర్‌రెడ్డి

**కరీంనగర్‌రూరల్:** ఆ తండ్రికదే చివరి వేడుక అయింది.. కొడుకు పుట్టినరోజునే గుండెపోటుతో మృతిచెందడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. రాఖీపండుగ, కొడుకు పుట్టినరోజు, కుటుంబసభ్యుల వివాహం కోసం సింగాపూర్ నుంచి మూడు రోజులక్రితమే వచ్చి అనూహ్య రీతిలో మృత్యువాత పడడం గ్రామస్తులను కలచివేసింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. కరీంనగర్ మండలం చామనపల్లికి చెందిన దావు మధుకర్‌రెడ్డి(46) ఉపాధి నిమిత్తం సింగాపూర్ వెళ్లాడు. మూడురోజులక్రితం గ్రామానికి వచ్చిన ఆయన శనివారం కుటుంబసభ్యులతో కలిసి రాఖీపండుగ జరుపుకున్నాడు. ఆదివారం కొడుకు సాత్విక్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల అనంతరం రాత్రి విందులో పాల్గొన్న మధుకర్‌రెడ్డికి ఆకస్మికంగా గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాఖీ పండుగ, కొడుకు పుట్టినరోజు, కుటుంబసభ్యుల వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు సింగాపూర్ నుంచి వచ్చిన మధుకర్‌రెడ్డి మృతిచెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. సింగాపూర్ నుంచి రాకపోయినా బతికేవాడంటూ విలపించారు. మృతుడికి భార్య స్రవంతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# రెండు ఆటోలు ఢీకొని విద్యార్థులకు గాయాలు


గాయపడిన సిద్ధార్థ


రోడ్డు కిందకు దూసుకెళ్లిన ఆటో

**జగిత్యాలక్రైం/సారంగాపూర్:** జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట, సారంగాపూర్ మండలం అర్పపల్లి శివారుల్లో ఓ ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న మరో ఆటో ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. సారంగాపూర్ మండలం రేచపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు నిత్యం జగిత్యాల రూరల్ మండలం గుల్లపేటకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఆటోలో వెళ్లి వస్తుంటారు. ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్తుండగా గుల్లపేట, అర్పపల్లి శివారులో ఎదురుగా వస్తున్న మరో ఆటో ఢీకొంది. ఈ ఘటనలో గుల్లపేటకు చెందిన గంగాధర సిద్దార్థ, పాలెపు శివానీ చేతులు విరిగాయి. వీరితోపాటు గాయపడిన విద్యార్థులను జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులతో వెళ్తున్న ఆటోను ఢీకొన్న ఆటో డ్రైవర్‌ను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. రూరల్ సీఐ సుధాకర్, సారంగాపూర్ ఎస్సై గీత చికిత్స పొందుతున్న విద్యార్థుల వద్దకు వెళ్లి సంఘటనపై ఆరా తీశారు.


భక్తులతో నిండిపోయిన శ్రీకనకసోమేశ్వర స్వామి ఆలయం


ఆలయం వద్ద వరదపాశం నైవేద్యంగా సమర్పిస్తున్న భక్తులు

### కిక్కిరిసిన శ్రీకనకసోమేశ్వర కొండ

**మల్లాపూర్:** జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లోని శ్రీకనకసోమేశ్వర కొండ శ్రావణ సోమవారం సందర్భంగా కిక్కిరిసిపోయింది. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన వరదపాశం వండి నైవేద్యంగా సమర్పించారు. ప్రధాన అర్చకులు బల్యాపెల్లి ప్రభాకరశర్మ బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగ గంగరాజం, వైస్ చైర్మన్ ఇల్లెందుల తుక్కారాంలు తెలిపారు.


కొండపైకి తరలివస్తున్న భక్తులు

### శంభో శంకర


ఆలయంలో కిటకిటలాడిన జనం

**వేములవాడ:** రాజన్నను సోమవారం 50వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు, ఆలయ ఆవరణలో నిలువెత్తు బెల్లం, కోడెమొక్కులు, కుంకుమపూజ, గండాదీపంలో నూనె, ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి తమ కుటుంబాలు బాగుండాలని మొక్కుకున్నారు. భక్తుల ద్వారా రూ.60 లక్షల ఆదాయం సమకూరింది.


కుంకుమపూజ నిర్వహిస్తున్న భక్తులు


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు